# రెండు గుండెల ఫిల్ము స్టార్

**ద**గ్గర్లో అందమైన స్థలం.
ఆ స్థలంలో నిలబడివుండి
తొలి చేష్టగా ఆమె తెలినవ్వు నవ్వింది. సిగ్గు తెరచాటు లేదు. అరచిటికె వ్యవధిలేదు. ఆమె తొలిచూపే కలుపుగోలు పూతూపు అయి వెల్లి విరిసింది. ఆమె ఎవరా అని ఆలోచిస్తూ ఆగిపోయాడు పురుషోత్తమరావు.

పురుషోత్తమరావు గొప్ప ఎల్లోపాథిక్ డాక్టర్. వెంటనే ఆమె నవ్విన నవ్వులో ఆమె చూచిన చూపులో "ఏదో జాడ్యం యనుమానించాడు. జాడ్యం యనుమానించాక యడిగితెలుసుకు తగిన చికిత్స చేయడం తన విధ్యుక్త ధర్మం అని తలపోసే హృదయంగల భిషగ్వరేణ్యుల కోవలో వాడు కావడంచేత మన డాక్టర్ వెంటనే "ఏమిటండి! ఆలా నవ్వుతారు? అకారణంగా?" అని అడిగాడు ఆమెను. ఆమె మంచి మనసు మనిషిలాగే తెప్పలార్చి "ఏమీలేదు. మీ దగ్గఱ స్కోప్ వున్నట్టుందే!" "మీటర్ కూడా వుందా?" అని అడిగింది. డాక్టర్ తనకోటు ప్రక్కజేబులోంచి తొంగిచూస్తూ వున్న పనిముట్టుమీద చేయివేసి 'You mean stetho? Yes! You mean thermo? Yes!" అని రెండోపనిముట్టు కోటుపై జేబులోంచి పైకి తీసి చూపాడు.

ఆమె "డాక్టర్ సాబ్! ఒక పర్యాయం ఇలా వచ్చి నన్ను ఆమూలాగ్రంగా పరీక్షించండి! మీ వద్ద వున్న ఆ గుండె రొద కొలగొట్టంతోటి ఆ వేడి కొలగాజు పుల్లతోటి!" అంది. డాక్టర్ "స్టెథస్కోప్! థెర్మో మీటర్" అంటాం మేం ఈ రెండింటినీ వరుసగా యంటూ సమీపించాడు. ఆమె "మేమూ ఆలాగే పిలుస్తాం పూర్తిగా పిలిచేటప్పుడు. ఒక్కొక్కప్పుడు

తెనుగున చెప్తాం. అయితే తెనుగులో "రాద" యన్నా "పుల్ల" యన్నా బాగుండదు చూడండీ; యందుకని తెనుగులో ఎప్పుడూ పూర్తిపేర్లే చెప్తాం" అంది. డాక్టర్ గాజుపుల్ల దులుపుతూ పాద రసం యవరోహణం పరికించి "ఈ పుల్ల నాలిక్కింద పెట్టి వుంచండి రెండు నిమిషాలు." యని అందిచ్చాడు థెర్మోమీటర్ అందిచ్చి,—ఆమె నాలిక్కింద దాన్ని ఆలా వుంచుకుంటూంటే,— "మీరు ఆంధ్రుల్లా మాట్లాడుతున్నారే!" అన్నాడు డాక్టర్. ఆమె—పెట్టుకున్న పుల్ల ఇంకా వేడి గ్రహించకుండానే—డాక్టర్ అన్న మాటకు ఉబ్బిపోయినట్టు పుల్ల ఈవలకు తీసి "ఆంధ్రుల్లాగేమిటి? నేను ఆంధ్రస్త్రీని" అంది. డాక్టర్ "తీసెయ్యకండి పుల్ల. అలాగే ఉంచుకోండి మఱి రెండునిమిషాలు" అన్నాడు. ఆమె కూర్చొని నిదానంగా థెర్మోమీటర్ నాలిక్కింద పెట్టుకుని ఆలోచనలో నిమగ్నురాలైనట్లు రెండు నిమిషాలు నిమీలిత నేత్ర అయింది. డాక్టర్ ఆ రెండు నిమిషాల్లో పరిసర స్థల సౌందర్యం విలోకింప సాగేడు.

ఆమె థెర్మోమీటర్ నోట్లోనుంచి వెలికి తీసుకున్నదై తనకుదా చూస్తూవుంది. డాక్టర్ "ఇలా ఇవ్వండి. నేచూచి చెప్తాగా! ఈ ప్రాంతం బహు సుందరంగా, ప్రకృతి లలితంగా వుందే? పూలతీగలు! పండ్లచెట్లు! మీదేనా ఇది?" అన్నాడు. ఆమెచేతను వున్న గాజుపుల్ల తానందుకుంటూ. ఆమె "ఈ వర్తమాన ఘటికయందు నాదే యీ స్థలం. ఇక్కడనుంచి నన్వెవ్వరూ కదపలేరు. మెదపలేరు. మీరుకూడా కూర్చొంటే కూర్చోవచ్చును. వద్దనదు ఎవర్నీ యీ చోటు!" డాక్టర్ "వద్దనడానికి స్థలానికి నోరుంటుందా? ఏమిటి? ఆ హక్కుమీది" అంటూనే గాజుపుల్ల నెక్కిన వేణ్ణి పరిశీలించేడు. "నార్మల్! పూరా నార్మల్; సర్వసాధారణంగా మానవస్త్రీకి ఎంతవేడిమి వుండాలో అంతే చక్కని వేడిమి చూపిస్తూవుంది యీపుల్ల" అన్నాడు. ఆమె వెల్లకితలా

పండుకుంటూ "గుండె?" అంది. డాక్టర్ స్టెథస్కోప్ మెలివిడదీసి యధావిధిగా ఆమె గుండెకాయ పరీక్షించాడు. మరిన్నీ వెన్ను చూపించమని ఆ వంకకూడా పరీక్షించాడు. డాక్టరుకు ఆమెలో ఏమిన్నీ రుగ్మత కనిపించలేదు. "ఓ. కె." అన్నాడు, ఓ. కె. అన్నా ఏదో అనుమానం తట్టి "అయితే" అన్నాడు వెంటనే. ఆమెకు తన చేయి ఆసరాయిస్తూ ఆలా లేవనెత్తి కూర్చునేటట్టు చేశాడు. ఆమె లేచి కూర్చుని చిరునవ్వు నవ్వుతూ "కూర్చోండి! ఇలా విశ్రయించండి! 'ఓ. కె.' అంటూ 'అయితే' అన్నారే? I have the word pregnancy ! మీ డయగ్నాసిస్ ఎలా వున్నా ప్రెగ్నెన్సీ అన్న పేరు మాత్రం దానికి పెట్టకండి. అదంటే నాకు పరమాసహ్యం" అంది. డాక్టర్ 'ఆమె ప్రక్కన కూర్చుంటూ ఆమె అందిచ్చిన సూచన అవలోదనం గావించుకు 'తమవంటి వారిని ప్రెగ్నెంటు అనడం ఎట్లా?—అయితే—అన్నానని మీరలా జడిశారేమోగాని అలాంటిదేమీ లేదు. నా వ్యాధి నోదే వేఱు. మీది ఇప్పుడు ఒక గుండెకాదు. రెండుగుండెలు! అదీ నా పరిశోధన పర్యవసానం' అన్నాడు. ఆమె 'ఆలా నామకరణం చేయవలసినదిగా మా ప్రొప్రయిటరుకు సలహా చెప్పండి. " Film star Pregnant " అని అయనా ఆ పేరు పనికిరాదని నేనూ ఇంతవఱకూ వివాదపడి యిటు వచ్చాను.

పురుషోత్తమరావు 'నేను డాక్టర్ను! కావలిస్తే అలా మెడికల్ సర్టిఫికెట్ వ్రాసివ్వగలను గాని ఫిల్మ్ పేరు పెట్టడంలో మీయజమానికి సలహా యివ్వడం అనేది నాస్వధర్మ నిర్వహణం కాదు.' అన్నాడు. ఆమె 'అట్లానే కానివ్వండి. మీకు తోచినట్టు సర్టిఫికేట్ రాసియివ్వండి' అంది. డాక్టర్ 'సలహాఫీజూ, సర్టిఫికెట్ ఫీజూ నేను ఛార్జి చేసేది మీకు తెలుసునా?' ఆమె 'అది అప్పుడే చేత్తో పట్టుకునే వున్నాను. పాతికరూపాయల కంటె ఎక్కువ వుంటుందా?' పురుషోత్తమరావు రెండుకళ్లా ఏభవ

విస్ఫారితాలయినాయి. ఎప్పుడు తీసిందో పైకి ఎక్కణ్ణుంచి తీసిందో అయిదు అయిదు రూపాయలనోట్లూను అని ఓ ప్రక్క అబ్బం అతణ్ణి పరిభ్రాంతుణ్ణి గావిస్తూవుంటే ప్రక్క ఊటకలం తెల్లనికాగితంమీద చఱచటా నడచిపోతూవుంది.

ఒకక్షణం ఏదో వ్రాసి ఆమె ముఖం వంక ఆమె పేరు కోసమో లేక కొత్త ఇన్స్పిరేషన్‌కోసమో ఎందుకో ఆలా చూచేడు ఆమె ఏదో అన్యుల అలికిడి విన్నట్టు పెడమొగమై మళ్ళీ డాక్టర్ వంకకు తిరిగి 'మీరు సర్టిఫికేటు వ్రాయనక్కఱ లేదు. మీ కలం 'రొంబ నైసుగా వుందే' అని ఆ కలం అతడను కోని తమాషాగా తనచేతిలోనికి తీసికొంటూ 'మా ప్రొప్రయిటర్ యిలా వస్తూవున్నారు నా కోసమని ఆయన్తో నా విషయమై మీకు తోచిన నిజం చెప్పివేసి వేయండి. మా ప్రొప్రయిటర్ యొక్క అభీష్టం మఱేమీలేదు. స్టార్‌యొక్క దైవిక మానసిక నిజానుభవాన్ని బట్టి ఫిల్ముకు పేరు వుంచితే ఆ ఫిల్ము ఆమె బాగా స్వానుభవశుద్ధిగా నటిస్తుందనీ! అందువల్ల ప్రేక్షకబృందానికి ఉత్తమోత్తమ వీక్షణీయంగా వుంటుందనీ!'—అంది. డాక్టర్ 'అంటే? నాయకి టి. బి. పేషంటు అయితే ఫిల్ముకు టి. బి. పేరుపెట్టి తీరుతారు అన్నమాట?' అన్నాడు. ఆమె 'అదే మనం ఇప్పుడు చూడాలి! అయినా ఆ తుది గొడవ అంతా మీ కెందుకు? ఇదిగో మీ పాతికరూపాయల ఫీజున్నూ. మీరు నా బొందిని తెలుసుకున్న ఆ మయసామం ఆయనకు సరిగ్గా వివేచించండి. అర్థమయ్యేటట్టు—అంతే నాక్కావలసింది' అంది.

ఈ సంభాషణాదులు ముగిసేపరికి ఫిల్ము ప్రొప్రయిటర్ 'పిళ్ళారి సెట్టి'—అరవ—వారి సరసకు చేరుకుంటూ 'నేను నీకోసంగాను ఇంత సేపట్నుంచీ నెమకుతున్నాను! ఇంగ ఇర్కి?' అన్నాడు, ఆమెను అవలోకిస్తూ ఆమెయొక్క రెండోప్రక్కకు అనగా డాక్టర్ వున్న ప్రక్కకు కాకుండా రెండోప్రక్కకు దరిసి

కమలాలపొళ్ళ మెటిసిపోతూ, ఆమె ' మీరేదో సమస్యలో పడి వుంటే నాకేం తోచక ఇలా వచ్చాను విశ్రాంతికోసం.' ప్రొప్రయిటర్ మంచిపనిచేశారు. 'ఇప్పటికైనా తేలిందా మీరుజ?' డాక్టర్ 'తేలడానికేముంది? ఆమెకు ఏ జబ్బూ లేదు. రెండుగుండెలజబ్బు తప్ప' అన్నాడు అప్రయత్నంగా. ప్రొప్రయిటర్ ' మేము సస్పెక్టు చేసిందీ అదే! పిల్లగుండె! తల్లిగుండె! పేరు ప్రెగ్నెన్సీ అన్నాం మేము. మీరేమన్నా రెండుగుండెల జబ్బు అన్నారు.' డాక్టర్ ' రెండుగుండెలంటే అది కాదు నా తాత్పర్యం. హార్టు! స్వీట్ హార్టు' అన్నాడు. ప్రొప్రయిటర్ ' మీ తెనుగు ఎప్పుడు విన్నా ఇంగ్లీషుకు తర్జుమాచేసుకు తెలుసుకుంటెనేగాని మా బోంట్లకు అర్థం కాదండీ! ఎవరా స్వీట్ హార్టు?' అని ఏదో ఊహించేడు.

ఆమె తిన్నని తేజంతో. మత్తెక్కించే మధురిమతో, మాటలకందని మమైక్యంతో పురుషోత్తమరావుకేసి అతడే తన స్వీట్ హార్టు అన్నట్టు దృష్టి సారించింది.

ప్రొప్రయిటర్ ' అట్లా అయితే రేపట్నుంచే షూటింగు ప్రారంభం!

అయ్యా! తమ పేరెవరో? క్షమించండి! మిమ్మల్ని నాయకపాత్ర ధరించవలసినదిగా కోరుతున్నాం. ఇది లోక బ్రహ్మానందంగాను, విశ్వమోహన సంకల్పంగాను భావించి, మీరు మమ్మల్ని అనుగ్రహించవలసినది.'—

'అనుగ్రహించవలసినది' అని పిళ్ళారిసెట్టి ఆఖరుమాటకు వచ్చేలో తదనుగుణ్యంగా, ఆమె తన్నాయనికి, తాను కూడా 'అనుగ్రహించవలసినది' యని బ్రతిమాలుకొంటూ వున్నంత ఇదిలో ఏదో రహస్యప్రబోధ గావించింది. కంటితోనో, పెదవితోనో, వివరంగా చెప్పడానికి వల్లగానంత అద్వైతంగా!

పురుషోత్తమరావు కాదనలేక పోయాడు. ప్రతిఫలం తొలుత అడగబోతూనే నిదానించి అన్నీ ఆమె యనుగ్రహంలోనే

యున్నట్టు ఎంచుకొని ఉద్రిక్తుడై 'ఫిల్ము పేరు ? యన్నాడు. ప్రొప్రయిటర్ 'మటీ ప్రెగ్నెంటు అనం ! రెండుగుండెల ఫిల్ము స్టార్ !' యని పేరు పెడుతున్నాం మీడయాగ్నోసిస్ ననుసరించి గుడ్‌నైట్ టుయు బోత్' యన్నాడు నిష్క్రమించేడు.

ఆమె 'అమ్మయ్యా ! మీవల్ల బ్రదికిపోయాను' యని లేస్తూ 'గుడ్‌నైట్ మై నాయక్ !' యంది, పురుషోత్తమరావును సాగనంపే చనువు అనువు యంతా 'నాయక్' యన్న పదోచ్చారణలో శంఖంవూదులా పూరిస్తూ, పురుషోత్తమరావు 'గుడ్‌నైట్ మైలావ్ ! రేపు కలుసుకుంటాంగా మళ్లీని ?' అన్నాడు.

ఆమె 'ఈ మాదిరి సమాగమం కాదు మన రేపటి సమాగమం ఈ వైపుగా ఈ వెనకటి మార్గంగా రాకూడదు తమరు రేపు. ఇది ఫిల్ముల్యాండుయొక్క పెరటినేల లేక బాక్‌గ్రౌండు' సింహద్వారం యసలు దర్వాజా మెయిన్‌రోడ్డుమీదకు వుంది. అలా దయచేయాలి తమరు, అటూ ఫ్రంట్. ఇది బాక్‌డోర్' అంటూ ఆమె దగ్గర్లోని స్థలసౌందర్యం పురుషోత్తమరావుకు ఎరుకపరుస్తూ 'ఫిల్ముల్యాండు ఫ్రంట్ యంతా దుమ్మూ ధూళీ, గడ్డి మొలకైనా కనిపించదు. వెనుతట్టే అంత బ్యూటీ అంత ఎంజాయ్‌మెంటు-ఎట్లా వున్నాయో చూడండీ పండ్లచెట్లు ! పచ్చిక పట్లూ !' యన్నిటికంటె మనం ప్రథమతః కలుసుకున్న చల్లని తావు. ఆ ఎన్జోయ్‌మెంటు ఆ రంజు మళ్లీ మనకు లభిస్తుంది యని యనుకోను. good night my hero !' యంది పూర్వం కంటె 'హీరో' పదోచ్చారణలో స్థాయి ఇనుమడిల్లేలా.

వారివారి నడుము కడసారి వీడుకోలునాటి యనురసంధ్యే చెప్పిందో? యర్ధరేత్రో చెప్పిందో? యప్పట్లో ప్రణయవాహినికి కాలవాహిని ఉపశాఖై యంతరించి వూరుకుంది !

సమాప్తం